# ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి

**కుత్బుల్లాపూర్:** మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతోనే ప్రభుత్వ భూమి కబ్జాదారుల చెరలో చిక్కుకుందని బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ ఆరోపించారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లో ఐదెకరాల గ్రేవీ, డంపింగ్ యార్డ్ స్థలాన్ని శంషుగూడ సర్వే నెంబర్ 57గా కోర్టు ఆర్డర్ చూపిస్తూ గాజులరామారం సర్వేనెంబర్ 304, 305, 307, 171 ప్రభుత్వ భూమి 92 ఎకరాలు ఆక్రమించారంటూ సోమవారం జరిగిన ప్రజావాణిలో బీజేపీ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. ప్రగతినగర్ డంపింగ్ యార్డ్, గ్రేవ్‌యార్డ్‌లను కబ్జా చేయడంతో పాటు ఆస్తుల నేలమట్టం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో రామచంద్ర నాయక్, కౌశిక్ నాయుడు, సాయిరెడ్డి, నరసింహ రెడ్డి, కుంకి రాము, కుమార్‌గౌడ్, విజయ్, ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.



కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న శ్రీశైలంగౌడ్

# 'కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం'

**సుభాష్‌నగర్:** కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. సోమవారం దండేరాజు ఆధ్వర్యంలో చంద్రగిరినగర్‌కు చెందిన పవన్, మల్లేష్, మలింగ, హనుమంతు తమ మిత్ర బృందం వంద మందితో కలిసి కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో రాహుల్ గాంధీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ఆలోచనా విధానాలకు ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని, రాష్ట్రంలో ప్రజల ఆదరణ చూస్తుంటే మెజార్టీ సీట్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందనే ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లాల్ మహ్మద్, మండవ శివకుమార్, రాజారెడ్డి, రాజ్‌కుమార్, జలీల్, విశాల్ పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమమే ధ్యేయం

**కుత్బుల్లాపూర్:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు స్థానిక సమస్యలపై ఎమ్మెల్సీని కలిసి పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. దీనిపై స్పందించి శంభీపూర్‌రాజు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## నియామకం

**దుండిగల్:** కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్‌గా పోషి మహేశ్ ముదిరాజ్ నియమితులయ్యారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి సోమవారం భౌరంపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేశ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేలా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నవీన్‌రెడ్డి, చిందకింది సురేశ్, మిద్దెల సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

## బాధ్యతల స్వీకరణ

**సుభాష్‌నగర్:** కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్‌గా అబ్దుల్ రహమాన్‌ఖాన్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ వినయ్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుకా, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అధికారులు సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

# కథనం చదివి.. పరిష్కారానికి కదిలి



సాక్షి ఎఫెక్ట్..

**రంగారెడ్డినగర్:** కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి బాపూనగర్ రోడ్డు నెంబరు–4లో గోదావరి జలాల మ్యాన్‌వాల్వ్‌ను ఏర్పాటు చేసేందుకు జలమండలి సిబ్బంది గొయ్యి తీసి వదిలేశారు. గొయ్యి కారణంగా రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు వాపోయారు. ఈ సమస్యపై ఈ నెల 5న సాక్షిలో 'గొయ్యి తీసి..పత్తా లేకుండా పోయారు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. మ్యాన్‌వాల్వ్‌ను నిర్మించి దానిపై మూత ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.

## దేవాలయానికి విరాళం అందజేత

**దుండిగల్:** దుండిగల్‌లో నూతనంగా నిర్మిస్తున్న రాజరాజేశ్వరీ పోచమ్మ దేవాలయానికి అక్షయ వాసుశ్రీ ప్రైడ్ యాజమాన్యం రూ.5 లక్షల విరాళం అందజేసింది. శంభీపూర్‌లో సోమవారం కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ సమక్షంలో అక్షయ ప్రైడ్ యజమాని సర్గారి జీవేందర్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొర్ర శంకర్ నాయక్ చౌహాన్, బండారి మహేందర్ యాదవ్, భరత్‌కుమార్, నేతలు నల్తూరి కృష్ణ, శ్రీనివాస్, రవిందర్ నాయక్, హన్మంతు, వెంకటేశ్ పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**కుత్బుల్లాపూర్:** ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి విద్యుదాఘాతానికి గురైన వ్యక్తి మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం మధ్యాహ్నం జీడిమెట్ల గ్రామంలోని పోస్టాఫీస్ సమీపంలోని శ్రీగజానన ఎన్‌క్లేవల్ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

# బాలికపై అత్యాచారం

- వ్యక్తిపై కేసు నమోదు

**జగద్గిరిగుట్ట:** ఓ మైనర్ బాలికపై అత్యాచారం జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్లమ్మబండ, ఎన్టీఆర్ నగర్‌లో పాఠశాలకు వెళ్తున్న బాలికపై స్థానికంగా ఉండే సంజీవ్ కుమార్ నోట్లో గుడ్డలు కుక్కిపలుమార్లు అత్యాచారం చేసి ఎవరికైనా చెబితే చంపేస్తానని కత్తితో బెదిరించాడు. ఆ బాలిక భయపడి ఎవ్వరికి చెప్పలేదు. ఇది జరిగి రెండు నెలలు కావస్తోది. అయితే.. బాలిక నెలసరి సరిగా కాకపోవడంతో తల్లిదండ్రులకు అనుమానం వచ్చి నిలదీయగా జరిగిన విషయం చెప్పింది. బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా నిందితుడిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపట్టారు.